

పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మధుసూదన్

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): పశువులకు తప్పకుండా గాలికుంటు వ్యాధి వేయించాలని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ రైతులకు సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలం విర్యాల, రాసుమల్లగూడ గ్రామాల్లో నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పశు వైద్యాధికారులు గ్రామాలకు వచ్చి ఉచితంగా గాలికుంటు టీకాలు వేస్తారని తెలిపారు. ఆయన వెంట షాద్‌నగర్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్, వైద్యాధికారులు డాక్టర్ ముక్కంటి రాజు, డాక్టర్ సునీత ఉన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు



రైతులు సాంకేతికతను వినియోగించుకోవాలి

వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రకాంత్

మంచాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త డా.చంద్రకాంత్ సూచించారు. జాతీయ మెట్ట పరిశోధన సంస్థ - కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మంచాల మండల పరిధి చిత్తాపూర్‌లో రైతులకు పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇఫ్కో సంస్థ సహకారంతో వ్యవసాయంలో డ్రోన్‌ల ద్వారా ఎరువుల వినియోగానికి సంబంధించి క్షేత్రప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ మాట్లాడుతూ వ్యవసాయంలో శాస్త్రసాంకేతికతను వినియోగించినట్లయితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. ఎరువులు, మందుల పిచికారీలో డ్రోన్లు ఉపయోగించడం రైతులకు లాభదాయకమని చెప్పారు. సాగు ఖర్చును తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డా.ప్రసాద్, డా.సుధీర్, డా.గోపాలకృష్ణారెడ్డి, డా.విజయ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి వెంకటేష్, ఏఈవో సాయిసిరి, రైతులు అన్నపూర్ణ, సుధాకర్, శ్రీను, అశోక్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.



యాచారంలో కురుస్తున్న వర్షం

యాచారంలో మోస్తరు వర్షం

యాచారం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు చౌదర్‌పల్లి, నందివనపర్తి, మల్కీజ్‌గూడ తదితర గ్రామాలలో శుక్రవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. గంటపాటు వాన పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వరద నీరు నిలువడంతో వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు.



తవ్వేకొద్దీ..!

ఉపాధి పనుల్లో వెలుగులోకి అవినీతి

ఉపాధి హామీ పథకంలో తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. వాటిని అరికట్టేందుకు అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా నిధులు కొల్లగొడుతూనే ఉన్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలు జరగకుండా ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నా అవినీతికి అడ్డుకట్ట మాత్రం పడడం లేదు. ఈ ఏడాది రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడు జిల్లాల్లో దాదాపు రూ.3 కోట్లకు పైన అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు అందాయి. వీటిపై విచారిస్తున్న అధికారులు ఇప్పటి వరకు రూ.61.97లక్షలు నిధులు దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారించారు. ఈ మొత్తాన్ని రికవరీ చేసేందుకు చర్యలు చేపట్టారు.

నిధులు స్వాహా చేస్తున్న అక్రమార్కులు

- ఉమ్మడి జిల్లాలో రూ. 61.97లక్షలు గోల్‌మాల్
- సామాజిక తనిఖీల్లో ఇప్పటి వరకు నిర్ధారణ
- రూ. 3కోట్ల అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు
- పలు మండలాల్లో కొనసాగుతున్న విచారణ
- అక్రమార్కులపై చర్యలకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జరుగుతున్న ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు కొనసాగుతున్నాయి. పలు మండలాలకు సంబంధించిన ఆడిట్ నివేదికలను విచారణాధికారులు ప్రభుత్వానికి పంపారు. ఇందులో వికారాబాద్ జిల్లాకు సంబంధించి ఎక్కువగా నిధులు దుర్వినియోగమయ్యాయి. వికారాబాద్ జిల్లాలో 4416 పనులకు సంబంధించి రూ.1.75కోట్లు దారిమళ్లినట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు ఇందులో రూ.35,94,459 దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. అలాగే రంగారెడ్డిజిల్లాలో 4287పనులకు సంబంధించి రూ.1.32కోట్ల అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు రాగా, విచారణ చేపట్టిన అధికారులు ఇందులో రూ.25,78,311 దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. అలాగే మేడ్చల్ జిల్లాలో రూ.19,300 మాయం చేసినట్లు తేలింది. ఇదిలా ఉంటే మూడు జిల్లాల్లో ఉపాధి పనులకు సంబంధించిన లెక్కల్లో కూడా భారీగా

మిగతా 7వ పేజీలో...

జిల్లాల వారీగా జాబ్‌కార్డులు, కూలీలు

జిల్లా	జాబ్‌కార్డులున్న కుటుంబాలు	నమోదైన కూలీల సంఖ్య
రంగారెడ్డి	1,58,181	2,58,803
వికారాబాద్	1,90,225	3,87,304
మేడ్చల్	17,911	19,330

ఫిర్యాదులు, నిధుల దుర్వినియోగం ఇలా..

జిల్లా	ఫిర్యాదుల సంఖ్య	నిధుల దుర్వినియోగం (ఇప్పటి వరకు)
రంగారెడ్డి	4287	రూ.25,78,311
వికారాబాద్	4416	రూ.35,94,459
మేడ్చల్	741	రూ.24,247



కూతురితో శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి దంపతులు

హార్స్ రైడింగ్‌లో క్రితిరెడ్డికి గోల్డ్‌మెడల్

శంకర్‌పల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మొయినాబాద్ మండల పరిధిలోని హైదరాబాద్ పోలో హార్స్ రైడింగ్‌లో తెలంగాణ ఈక్వెస్ట్రియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రీజినల్ ఈక్వెస్ట్రియన్ లీగ్ పోటీలు పలువురిని అలరించాయి. బాల బాలికల హార్స్ రైడింగ్ అండర్ -10 ఈక్వెస్ట్రియన్ హార్స్ విభాగంలో శంకర్‌పల్లి మండల మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి కూతురు క్రితిరెడ్డి ప్రతిభ కనబరిచి స్వర్ణం పతకం గెలుచుకుంది. చిన్న వయస్సులోనే గోల్డ్ మెడల్ సాధించడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

సదరం సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు సదరం సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. దివ్యాంగులతో వైద్యులు సోదరభావంతో మెలగాలని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో సదరం సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులను చూసి షాద్‌నగర్ పట్టణంలో సదరం కేంద్రం ఏర్పాటుకు రెండేళ్ల నుంచి జిల్లా వైద్య ఉన్నతాధికారులు, కలెక్టర్‌తో సంప్రదించానని, కానీ వారంతా ఇది అంత సులభతరం కాదని వెల్లడించారని తెలిపారు. కానీ ఈ విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో చర్చించడంతో ఆయన ఇక్కడ సదరం కేంద్రం ఏర్పాటుకు సమ్మతించారన్నారు. గత ప్రభుత్వం దివ్యాంగులను పూర్తిగా విస్మరించిందని, కనీసం వారికి ఐడీ కార్డులు కూడా ఇవ్వలేదన్నారు. దివ్యాంగులు ప్రతీ చిన్న విషయానికి కొండాపూర్ వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి షాద్‌నగర్‌లో సదరం కేంద్రం ఏర్పాటు చేయించాలన్న లక్ష్యంతో ముందుకు సాగి సాధించామన్నారు. ప్రస్తుతం స్థల ప్రభావం వల్ల కమ్యూనిటీ ఆస్పత్రిలో సదరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేంద్రాన్ని కొనసాగిస్తున్నామని, మరో రెండు నెలల్లో వంద పడకల ఆస్పత్రి అందుబాటులోకి రానుందని, అందులోనే ప్రత్యేకంగా సదరం సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళా సమాఖ్య ప్రాజెక్టు డైరెక్టర్ దివ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చి షాద్‌నగర్‌లో సదరం సెంటర్‌ను ఏర్పాటు చేయించడం హర్షణీయమన్నారు. దివ్యాంగులే కాకుండా పేదల పక్షాన నిలబడుతూ వారికి అవసరమైన మౌలికసదుపాయాలు, వారు ఆర్థికంగా ఎదిగేందుకోసం నిరంతరం తమతో సంప్రదిస్తుంటారని చెప్పారు. మహిళ సంరక్షణ కోసం ఎమ్మెల్యే చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌అలీఖాన్, కాంగ్రెస్ పార్టీ నేతలు చెంది తిరుపతి రెడ్డి, ఎండీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



ప్రచారానికి బయల్దేరుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్‌దే విజయం

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తర్వాత బీఆర్‌ఎస్‌కు చావుదెబ్బే

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రజలంతా కాంగ్రెస్‌ను ఆశీర్వదిస్తూ అండగా నిలుస్తున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఎన్నిక ఏదైనా ఇక కాంగ్రెస్‌దే ఘన విజయమని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల కాంగ్రెస్ నాయకులతో శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారానికి బయల్దేరి వెళ్లారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో ఏడు పోలింగ్ బూత్‌ల ప్రచార బాధ్యతలను అప్పగించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్‌ఎస్ పార్టీ ఉనికి కోసం సాగిస్తున్న కుట్ర రాజకీయాలు ప్రజలు తిప్పికొట్టక తప్పదన్నారు. కేసీఆర్ నిరంకుశ పాలనను ప్రజలు ఇంకా మరిచిపోలేదని, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో చావుదెబ్బ తప్పదన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు వేరైన అంతర్గతంగా రెండు కలిసే పని చేస్తున్నాయని కసిరెడ్డి ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించకుండా కాలయాపన చేస్తుందన్నారు. బీసీల సంక్షేమం పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ బిల్లు ఆమోదించాలన్నారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల అభివృద్ధి, నిధుల కేటాయింపులో

మిగతా 8వ పేజీలో...

పోలీసుల త్యాగాలు మరువలేనివి

3వ బెటాలియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలు మరువలేమని మూడో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా అన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ ప్రత్యేక పోలీస్ మూడో బెటాలియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల వెంట ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు అమరవీరులు ప్రతీ ఒక్కరికి ప్రేరణగా నిలుస్తారని ఆయన గుర్తు చేశారు. పోలీసులు నిబద్ధతతో కర్తవ్య నిర్వహణ చేయాలన్నారు. అదనపు కమాండెంట్ శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ కమాండెంట్లు పాండు, శ్రీనివాస్ ర్యాలీలో పాల్గొన్నారు.



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

గ్రీన్ చానల్ ద్వారా లంగ్స్ తరలింపు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్‌చానల్ ద్వారా విశాఖపట్నం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన లంగ్స్ బాక్స్‌ను సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విశాఖపట్నం నుంచి 6ఈ 873 ఇండిగో విమానంలో సాయంత్రం 6.40 గంటలకు ఎయిర్‌పోర్టుకు లంగ్స్ బాక్స్ చేరుకుంది. ఇక్కడి నుంచి కిమ్స్ ఆస్పత్రి వరకు ట్రాఫిక్ పోలీసులు గ్రీన్ చానల్ ఏర్పాటు చేశారు. దీంతో అంబుల్స్‌లో లంగ్స్ బాక్స్‌ను 27 నిమిషాల్లోనే కిమ్స్ చేర్చారు. అక్కడ పేషెంట్‌కు ఆపరేషన్ ద్వారా లంగ్స్ అమర్చినట్లు వైద్యులు తెలిపారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రవిశంకర్

టెక్నాలజీపై పట్టు సాధించాలి

ఆదిభట్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలల్లో జరిగే జాతీయ, అంతర్జాతీయ సదస్సులతో నూతన టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన పెరుగుతుందని, దానిపై పట్టు సాధించాలని ఐఐటీ తిరుపతి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి డాక్టర్ మామిళ్ళ రవిశంకర్ అన్నారు. శుక్రవారం మంగల్‌పల్లిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే మెటీరియల్, మ్యానుఫ్యాక్చరింగ్, మోడలింగ్ టెక్నిక్స్‌పై అంతర్జాతీయ సదస్సును చైర్మన్ డాక్టర్ చెరబుడ్డి రాఘవతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఆత్మనిర్భర్ భారత్ పిలుపుమేరకు సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల దేశంలోని శాటిలైట్ ఎర్త్‌స్టేషన్ ప్రాజెక్టుకు ఉపకరించే రిమోట్ సెన్సింగ్, స్ట్రాటజిక్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్స్‌కు కన్సల్టెన్సీ సర్వీస్ అందిస్తోందన్నారు. దేశ రక్షణ, అంతరిక్ష విభాగాల్లో ఉపకరించే టీఈ-21 ట్రాకింగ్ హైదరాబాద్‌లోని కాంసాట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ రూపొందిస్తుండగా.. ఈ సాంకేతిక పరిజ్ఞానంలో సీవీఆర్ కాలేజీ తోడ్పాటునందిస్తోందని గుర్తు చేశారు. ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, ప్రొఫెసర్ గోపాలకృష్ణ, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శంకర్

చేవెళ్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.శంకర్ తెలిపారు. శుక్రవారం చేవెళ్లలోని అంబేడ్కర్ భవన్‌లో ఎస్‌ఎఫ్‌ఐ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్ల నుంచి రాష్ట్రవ్యాప్తంగా రూ.8వేల కోట్లపై చిలుకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని, ప్రైవేట్ కళాశాలలో చదివే విద్యార్థులు సర్టిఫికెట్స్ తీసుకుందామంటే యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. బకాయిలు ప్రభుత్వం ఇంకా విడుదల చేయలేదని సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఇటీవల అన్ని కళాశాలల యాజమాన్యంతో చర్చలు జరిపి రూ.1200 కోట్లు రెండు దఫాలుగా విడుదల చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఇర్ఫాన్, కార్యదర్శిగా మాల చందు, రాము,



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శంకర్

రిజ్వాన్, సహాయ కార్యదర్శిగా కె.పవన్‌కుమార్, ఎండీ అల్తాఫ్, బేగరి నవీన్ నియమించారు. కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్, సహాయ కార్యదర్శి చరణ్‌గౌడ్, నాయకులు చరణ్, అభిషేక్, ధనుష్, విష్ణు, కైఫ్, అనిరుద్, విశాల్ ఉన్నారు.



రిలే నిరాహార దీక్షలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

షాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ వచ్చే వరకూ పోరాడుతామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో షాబాద్‌లో అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారానికి 13వ రోజుకు చేరుకుంది. దీక్షలో వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు. నాయకులు రవీందర్, రాజేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు, రాము, వెంకటస్వామి, ఖలీల్, చంద్రయ్య, గౌరీశ్వర్, వడ్డెర సంఘం నాయకులు వెంకటేష్, కుమార్, శ్రీనివాస్, సాయిలు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అపజయాలకు వెరవవద్దు

- గుర్తింపు కోసం పాకులాడవద్దు.. మన శ్రమే మనకు గుర్తింపు తెస్తుంది
- చీనాబ్ బ్రిడ్జి ఫేమ్ ప్రొఫెసర్ మాధవీలత
- నిట్ టెక్నోజియాన్ ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగం

హనుమకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మన జీవితం.. మన వ్యక్తిత్వం విశాలం కావాలంటే మన చుట్టూ ఉన్న హద్దులను చెరిపేసుకోవాలని, అదే సమయంలో మన పరిమితులేమిటో కూడా గుర్తెరగాలని ప్రపంచంలోకెల్లా అత్యంత ఎత్తైన చీనాబ్ వంతెన నిర్మాణంలో క్రియాశీల భూమిక పోషించిన బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ జి. మాధవీలత పిలుపునిచ్చారు. వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సాంకేతికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అపజయాలకు ఎవరూ వెరవవద్దన్నారు. అపజయం వెంట విజయం ఎప్పుడూ ఉంటుందని, మనం చేయాల్సిందల్లా దాని వెంట పరుగు తీయడమేనన్నారు. జీవితంలో ఉన్నతంగా రాణించాలని అందరూ అనుకుంటారని, కానీ తమ చుట్టూ ఉన్న అడ్డంకులను చూసి కుంగిపోతారని పేర్కొన్నారు. లక్ష్యసాధన దిశగా ముందడుగు వేయాలంటే ముందు ఆ అడ్డంకులను ఛేదించుకొని తమను తాము విస్తరించుకోవాలని సూచించారు. గుర్తింపు కోసం వెంపర్లాడవద్దన్నారు. ఎవరూ మిమ్మల్ని గుర్తించకపోయినా చేయాల్సిన పని చేసుకుంటూపోతే గుర్తింపు తప్పనిసరిగా లభిస్తుందని తెలిపారు. ఇందుకు తానే ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు. వరంగల్ ఆర్ఈసీలో(ప్రస్తుతం నిట్) చదువుకున్న తాను.. గుర్తింపు కోసం ఏనాడూ పాకులాడలేదన్నారు. చీనాబ్ వంతెన నిర్మాణం పూర్తయ్యాక అందులో తన పాత్రేమిటో తెలిసిన తర్వాత అందరూ తనను ప్రత్యేకంగా గుర్తించడం మొదలుపెట్టారని చెప్పారు. తాను ఎంటెక్ చదివిన వరంగల్ నిట్‌ను సైతం ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారని పేర్కొన్నారు. వరంగల్ నిట్‌లో చదువుకున్నప్పటికీ పూర్వ విద్యార్థిగా ఇప్పటి వరకు పేరు నమోదు చేసుకోలేదని, చీనాబ్ వంతెన నిర్మాణం తర్వాత కళాశాల యాజమాన్యం పలుమార్లు ఆలమ్నీగా రిజిస్టర్ కావలసిందిగా కోరిందని తెలిపారు. వరంగల్ నిట్ ఒక అద్భుతమైన విద్యా కేంద్రంగా మాధవీలత అభివర్ణించారు. వరంగల్ నిట్ తనకు జీవితంతోపాటు జీవిత భాగస్వామిని కూడా ఇచ్చిందని ధన్యవాదాలు తెలిపారు. తన భర్త ఇదే కళాశాలలో ఎంటెక్(మెకానికల్) చేశారని, ప్రస్తుతం గూగుల్‌లో కీలక పదవిలో ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, సాంకేతిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.వెంకన్న, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్, ఫ్యాకల్టీ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ పి.రాధాక్రిష్ణ పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న మాధవీలత

అటవీ భూముల పరిష్కారానికి అధికారులుగా అదనపు కలెక్టర్లు

- అటవీ భూముల రక్షణలో కీలకం.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అటవీ భూముల సమస్యల పరిష్కారానికి అధికారులుగా అదనపు కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ అటవీ చట్టం-1967లోని సెక్షన్4(1)(సీ)ప్రకారం ఈ కొత్త నియామకాలు చేపట్టినట్లు శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అటవీ భూముల సమస్యలకు సెటిల్మెంట్ అధికారులుగా ఇప్పటివరకు వ్యవహరించిన జాయింట్ కలెక్టర్ల పోస్టులు రద్దయిన నేపథ్యంలో, అదనపు కలెక్టర్లకు(రెవెన్యూ) ఆ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో అటవీసర్వే, సరిహద్దుల విషయంలో తీసుకునే నిర్ణయాలకు సంబంధించిన పనులను జాయింట్ కలెక్టర్లు నిర్వహించేవారు. అటవీ భూభాగాలకు సంబంధించిన అభ్యంతరాలు స్వీకరించి, పరిశీలించడంతో పాటు, రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించే విధానంలో కీలక పాత్ర పోషించారు. తాజాగా ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ చేసిన సిఫార్సుల మేరకు అటవీ భూముల సెటిల్మెంట్ పనులు తక్షణమే అదనపు కలెక్టర్లకు అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. సంబంధిత మార్పులతో కూడిన నోటిఫికేషన్‌ను ఈ నెల 31న విడుదల చేయనున్నారు. ఆ రోజునుంచే అదనపు కలెక్టర్ల నియామక ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని జీవోలో పేర్కొన్నారు.

బీసీలకు 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇవ్వాల్సిందే

- బీసీల మహాధర్నాలో జస్టిస్ ఈశ్వరయ్య డిమాండ్
- ధర్నాలో పాల్గొన్న పలు బీసీ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

కవాడిగూడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీలకు చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు కల్పించకపోతే కేంద్రంపై యుద్ధం ప్రకటిస్తామని పలువురు బీసీ సంఘాల నేతలు, రాజకీయ పార్టీల నేతలు హెచ్చరించారు. రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా వారికి ప్రాతినిధ్యం లేదన్నారు. రాజకీయంగా బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడంతో చట్టసభల్లో వారి ఉనికి నామమాత్రంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ధర్నాచౌక్ వద్ద '42% బీసీ రిజర్వేషన్ల సాధన సమితి' ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జస్టిస్ ఈశ్వరయ్య, పలువురు రాజకీయ పార్టీల నేతలు, బీసీ సంఘాల నేతలు హాజరై మద్ద తు ప్రకటించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం ద్వారానే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. బీసీలకు చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు ఇవ్వాలని, పార్టీ పరంగా కాదని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. "రిజర్వేషన్లు బీసీల హక్కు" అని అన్నారు. బీసీలను పాలక వర్గా లు బిచ్చగాళ్లుగా చూస్తున్నాయని ఎమ్మెల్సీ మధుసూదనాచారి మండిపడ్డారు. గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని కేంద్రం బీసీలను మోసం చేస్తోందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పన కోసం కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉందని చెప్పారు. బీసీ రిజర్వేషన్లను కేంద్రం అడ్డుకుంటోందని మాజీ ఎంపీ హనుమంతరావు ఆరోపించారు. రిజర్వేషన్ల సాధన కోసం బీసీలంతా ఐక్యంగా పోరాటం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. నవంబరు 10 నుంచి 30వ తేదీ వరకు కామారెడ్డి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీసీ చైతన్య యాత్రలు చేపడుతున్నట్లు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు వెల్లడించారు. ఈ ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు.

బీసీలంటే కేసీఆర్‌కు అంత చులకనా?

- బీసీ బిడ్డ నవీన్ యాదవ్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలి: బీర్ల
- తెలంగాణకు, కేటీఆర్‌కు ఏంటి సంబంధం?: మందుల సామేలు
- హరీశ్.. బాకీ కార్డులపై బహిరంగ చర్చకు సిద్ధమా: బల్మూరి

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి, బీసీ బిడ్డ అయిన నవీన్ యాదవ్‌ను రౌడీషీటర్ అంటూ కేసీఆర్ అవమానించాడు. బీసీలంటే ఆయనకు అంత చులకనగా కనిపిస్తున్నారా?' అంటూ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించి.. బీసీలను రౌడీలుగా చూపించే ప్రయత్నం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్‌లకు తగిన బుద్ధి చెప్పాలని శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బీసీలపై కేసీఆర్, కేటీఆర్‌లు పిచ్చి మాటలు మాట్లాడుతుంటే ఆ పార్టీలోని శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ వంటి బీసీ నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. నవీన్ యాదవ్‌కు కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కుంభకర్ణుడు ఆరు నెలల పాటు తిని.. ఆరు నెలలు నిద్రపోయిన చందంగా కేసీఆర్ రాజకీయం ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యమే లేని కేటీఆర్‌కు, తెలంగాణకు ఏంటి సంబంధమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ప్రశ్నించారు. బీఆర్ఎస్ అంటే బొందలగడ్డ పార్టీ అంటూ ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణను దోచుకున్న కల్వకుంట్ల కుటుంబమే దండుపాళ్యం ముఠా అని.. నమ్ముకున్నవారిని నట్టేట ముంచిన చరిత్ర ఆ కుటుంబానిదని దుయ్యబట్టారు. బాకీ కార్డుల పేరుతో హడావుడి చేస్తున్న హరీశ్ రావు.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు బాకీ పడ్డ హామీలను గురించి మరిచిపోయారా అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఎద్దేవా చేశారు. బాకీ కార్డులు, బీఆర్ఎస్ పదేళ్ల పాలన.. కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజల సమక్షంలో చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని హరీశ్.. ఇప్పుడు కపట ప్రేమ చూపుతున్నాడని మండిపడ్డారు. పదేళ్ల అధికారంలో ఉండి కూడా ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయని బీఆర్ఎస్‌కు, హరీశ్‌కు నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌గౌడ్ ప్రశ్నించారు. వారు ఉద్యోగాలు ఇవ్వలేదు కాబట్టే రాష్ట్రంలోని నిరుద్యోగులు ఆ పార్టీని ఓడించారని ఓ ప్రకటనలో విమర్శించారు.

పిల్లలను వదిలి వెళ్లిందనే కసితో..

భార్యను హతమార్చిన భర్త

- గొడ్డలితో నరికి చంపిన వైనం
- ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో ఘటన


వర్ధని (ఫైల్)

ఏన్కూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తనను, ముగ్గురు పిల్లలను వదిలేసి వేరే వ్యక్తితో సహజీవనం చేస్తోందన్న కోపంతో ఓ భర్త గొడ్డలితో భార్యను హతమార్చాడు. ఈ దారుణం ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం కాలనీనాచారం గ్రామంలో శుక్రవారం జరిగింది. కాలనీనాచారానికి చెందిన తాటి రామారావుకు అదే గ్రామానికి చెందిన వర్ధని (32)తో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు సంతానం. ఈ క్రమంలో వర్ధని అదే గ్రామానికి చెందిన అఖిల్ అనే వ్యక్తితో సన్నిహిత సంబంధం పెట్టుకుని, ఏడాది క్రితం భర్త, పిల్లలను వదిలి విజయవాడ వెళ్లి సహజీవనం సాగించింది. పెద్దమనుషులు, గ్రామస్థుల సమక్షంలో పంచాయితీ చేసి హెచ్చరించినా ఆమెలో మార్పు రాలేదు. మళ్లీ ఆరు నెలలుగా అఖిల్‌తో సత్తుపల్లి సమీపంలో సహజీవనం చేస్తోంది. ఈనెల 22న (బుధవారం) వర్ధని అఖిల్‌తో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లిలోని కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న కుమార్తెను చూసేందుకు వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న భర్త రామారావు అక్కడికి వెళ్లి అఖిల్‌తో గొడవపడ్డాడు. అనంతరం అఖిల్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని బలవంతంగా లాక్కుని, భార్య వర్ధనిని తీసుకుని స్వగ్రామమైన కాలనీనాచారం వచ్చా డు. పిల్లలు పెద్దవారవుతున్నారని,ఇక నుంచి కలిసి ఉందామని నచ్చజెప్పాడు. దానికి వర్ధని నిరాకరించింది. అప్పటికే రాత్రవడంతో అక్కడే ఉన్న ఆమె.. గురువారం కూడా భర్త ఇంట్లోనే ఉంది. భార్యపై కోపం పెంచుకున్న రామారావు శుక్రవారం తెల్లవారుజామున ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న వర్ధనిని గొడ్డలితో నరికాడు. తల, ముఖంపై తీవ్ర గాయాలవడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. వర్ధని తల్లి ముక్తి రాధమ్మ ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసిన పోలీసులు రామారావును అదుపులోకి తీసుకున్నారు.

ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదంపై

4 వారాల్లో నివేదికివ్వాలి

- సీఎస్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్ (ఎస్‌ఎల్‌బీసీ) టన్నెల్ ప్రమాదంపై నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆదేశించింది. గత ఫిబ్రవరి 22న టన్నెల్ పైకప్పు కూలిపోవడంతో 8 మంది చిక్కుకుపోగా, మనోజ్‌కుమార్, గుర్‌ప్రీత్‌సింగ్ మృతదేహాలను వెలికి తీశారు. ప్రమాదం జరిగి 8 నెలలవుతున్నా గల్లంతైన మిగతా ఆరుగురు కార్మికుల సమాచారం కనుగొనలేదని ఎన్‌హెచ్‌ఆర్‌సీలో మానవ హక్కుల న్యాయవాది ఇమ్మనేని రామారావు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారించి సమగ్ర నివేదికను సమర్పించాలని గత జూలై 31న నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శిని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది. అయితే, నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి నివేదిక సంతృప్తికరంగా లేదని పేర్కొన్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ.. తక్షణమే దీనిపై విచారణ జరిపి, 4 వారాల్లో నివేదిక సమర్పించాలని ఈనెల 19న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

గన్స్ ఉపయోగించినవారిపై చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

ఓ సిమెంట్ కంపెనీ యాజమాన్యం వద్ద డబ్బుల వసూళ్ల వ్యవహారంలో గన్స్ ఉపయోగించినవారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఎన్. నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాన అనుచరుడు రోహిన్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, మాజీ ఓఎస్‌డీ సుమంత్ గన్స్ ఉపయోగించిన వివాదంలో ఉన్నారని, ఈ మేరకు శుక్రవారం ఆయన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గన్ కల్చర్ తెచ్చి రాష్ట్రాన్ని మరో బిహార్‌లా తయారు చేయాలని రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, అక్రమాలు, అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రానికి అనేక రకాల పరిశ్రమలు తెచ్చి అభివృద్ధి చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్త వాటిని తేకపోగా ఉన్న పరిశ్రమల యాజమాన్యాలను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

12.65 కోట్ల సాహితీ ఇన్‌ఫ్రా ఆస్తులు జప్తు

- ఒక్క డైరెక్టర్ పూర్ణచంద్రరావు 126 కోట్ల దారి మళ్లింపు

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సాహితీ ఇన్‌ఫ్రా స్కామ్ కేసులో ఆ సంస్థ డైరెక్టర్ పూర్ణచంద్రరావుకు చెందిన రూ.12.65 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అటాచ్ చేశారు. ఇప్పటికే ఈ కేసులో పూర్ణచంద్రరావును ఈడీ అరెస్టు చేసింది. ఇళ్ల ప్లాట్లు ఇస్తామని వేలాది మంది ఖాతాదారుల నుంచి రూ.వేల కోట్లు వసూలు చేసిన సాహితీ ఇన్‌ఫ్రా కంపెనీపై గతంలో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. ఈ కంపెనీ తన ఖాతాదారులకు సుమారు రూ.845 కోట్లు బకాయి పడిందని నిర్ధారించారు. సంస్థ డైరెక్టర్‌గా పూర్ణచంద్రరావు ఒక్కరే సుమారు రూ.126 కోట్లు దారి మళ్లించి.. ఆ సొమ్ముతో 21 ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఈడీ గుర్తించింది.

బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్‌లో మరో 150 సీట్లు

రాజేంద్రనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ ఏడాది నుంచి బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్‌లో మరో 150 సీట్లు అందుబాటులోకి రానున్నాయని వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి మూడు నూతన వ్యవసాయ కళాశాలలను మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా హుజూర్‌నగర్‌లో ఏర్పాటు కానున్న కళాశాలలో 30 సీట్లు, కొడంగల్‌కు వచ్చే కళాశాలలో 30 సీట్లు, నిజామాబాద్‌లో ఏర్పాటయ్యే కళాశాలలో 30 సీట్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఇదివరకే ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ సీట్ల భర్తీకి త్వరలో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కాగా మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ వెనుకబడిన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆర్థిక సహకారంతో తెలంగాణ ఎప్‌సెట్-2025లో అర్హత సాధించిన వెనుకబడిన తరగతుల విద్యార్థులకు బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్‌లో మరో 60 సీట్లను ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు జానయ్య తెలిపారు. ఈ సీట్లను రాజేంద్రనగర్, వరంగల్, జగిత్యాల, పాలెం, సిరిసిల్ల, అశ్వారావుపేట్ కళాశాలల్లో ఒక్కో కళాశాలలో 10 సీట్ల చొప్పున భర్తీ చేయనున్నట్లు చెప్పారు. వీటిలో ప్రవేశాల కోసం ug.mjptbcwreis.net, pjtau.edu.in వెబ్‌సైట్‌లలో ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.


సభ్యత్వ నమోదులో యూటీఎఫ్ నాయకులు

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

» యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

నవాబుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీని వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. వెంకటరత్నం అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే పీఆర్సీని అమలు చేయడంతో పాటు డీఏలు విడుదల చేయాలన్నారు. పెండింగ్ వేతనాలను చెల్లిస్తూ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను విడుదల చేయాలన్నారు. స్కావెంజర్స్ అమౌంట్‌ను విడుదల చేయాలన్నారు. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవీందర్, పరమేశ్వర్, వెంకటయ్య, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ అశోక్, మండల ఉపాధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం వెళ్లే భక్తులకు బస్సు సదుపాయం


ఆర్టీసీ పరిగి డీఎం కృష్ణమూర్తి

పరిగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అరుణాచలగిరికి వెళ్లే భక్తులకు ఆర్టీసీ ద్వారా బస్సు సదుపాయం కల్పిస్తున్నట్లు పరిగి డిపో మేనేజర్ కె.కృష్ణమూర్తి తెలిపారు. నవంబరు 3వ తేదీన బయలుదేరి 6వ తేదీన సాయంత్రం తిరిగి పరిగికి చేరుకుంటుందని తెలిపారు. 3వ తేదీన సాయంత్రం బయలుదేరే బస్సు 4న ఏపీలోని కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దర్శనం, వెలూరులోని గోల్డెన్ టెంపుల్ దర్శనం, 5న అరుణాచలం గిరి ప్రదర్శన పూర్తి చేసుకుని 6న తిరుగు ప్రయాణంలో జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం దర్శించుకుని సాయంత్రం పరిగికి చేరుకుంటుందని వివరించారు. ఒక్కొక్కరికి రూ.3600, పిల్లలకు రూ.2వేల చొప్పున రిజర్వేషన్ చార్జీలు చెల్లించి బుక్ చేసుకోవాలని సూచించారు. అడ్వాన్స్ బుకింగ్, పూర్తి వివరాలకు 9490215648, 9440313917, 7569065644లను సంప్రదించాలని సూచించారు.

దర్గా గంధోత్సవం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మైనారిటీ నాయకులు

కొడంగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణంలోని మసీదులో శుక్రవారం మహిబూబ్‌సుభానీ దర్గా గంధోత్సవం పోస్టర్‌ను విడుదల చేసినట్లు మైనారిటీ నాయకులు ఎస్ఎం.గౌసన్ తెలిపారు. ఈనెల 31న జామేమసీద్ నుంచి కొడంగల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని మహిబూబ్‌సుభానీ దర్గా వరకు ర్యాలీ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా నవంబరు 1న మసీద్‌లో అన్నదానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, మతపెద్దలు అబ్దుల్ మన్నాన్ రహెబర్, అబ్దుల్ రషీద్, అబ్దుల్ కరీం, షేక్ ఆదిల్, సర్తాజ్ హుసేన్, సాబేర్‌ఖాన్, ఆమేర్ హుసేన్, మొహ్మద్ అజహర్, షేక్ షంశీర్, ఫేరోజ్‌ఖాన్, మక్సూద్‌బిన్ అలీ, సయ్యద్ అర్షద్‌అలీ ఖాద్రి, మొహ్మద్ ఖాసీం పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


ప్రతాప్‌సింగారంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారంలో శుక్రవారం హైడ్రా అధికారులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా జేసీబీలతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ప్రతాప్‌సింగారం సర్వేనంబర్లు 315, 316, 317 భవానీనగర్(బుచ్చిరెడ్డి వెంచర్)లేఅవుట్‌లోని 6.14ఎకరాల్లో ఉన్న 88 ప్లాట్లను మధుసూదన్‌రెడ్డి ఆక్రమించి చుట్టూ ప్రహరీ నిర్మించాడు. గతంలో ప్లాట్ల బాధితులు పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగి ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఇటీవల బాధితులు తిరిగి హైడ్రా అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం ఉదయం హైడ్రా, పోచారం మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ ఆధ్వర్యంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీని కూల్చివేశారు.

బ్లడ్ క్యాన్సర్‌తో జవాన్ మృతి


వెంకట్‌శ్యామ్‌రెడ్డి (ఫైల్)

నవాబుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ జవాన్ మృతి చెందిన సంఘటన నవాబుపేట మండలంలోని వట్టిమీనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వెంకట్ శ్యామ్‌రెడ్డి(32) ఆర్మీలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు తెలిపారు. రెండేళ్ల క్రితం ధారూర్ మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన మనీషాతో వివాహం జరిగింది. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వెంకట్‌శ్యామ్‌రెడ్డి డిల్లీలోని ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆర్మీ జవాన్ వెంకట్ శ్యామ్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రశాంత్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి


మాట్లాడుతున్న దండు శ్రీను, నర్సింహ

ఆమనగల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలు రోజురోజుకు క్షీణించి పోతున్నాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు శ్రీను, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహులు అన్నారు. గోరక్షణ కోసం కృషి చేసిన ప్రశాంత్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ దాడులకు పాల్పడిన వారిపై పోలీసు శాఖ చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రోద్బలంతోనే దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


మాట్లాడుతున్న గర్వ్ అగర్వాల్

మేడ్చల్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) చదువులతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని డీఆర్ఎస్ఐఎస్ డైరెక్టర్, అంతర్జాతీయ స్కేటర్ గర్వ్ అగర్వాల్ అన్నారు.మైసమ్మగూడలోని డీఆర్ఎస్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో శుక్రవారం క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల సమతుల్య జీవన శైలిని అభివృద్ధి పరచడంతో పాటు క్రమ శిక్షణను పెంపొందిస్తాయన్నారు. పాఠశాల స్థాయినుంచి విద్యార్థులకు ప్రోత్సహిస్తే వారు అంతర్జాతీయ స్థాయికి చేరుకోగలరన్నారు క్రీడల పట్ల ఆసక్తి కనపరిచే పిల్లలను వారి తల్లిదండ్రులు అడ్డుకోకుండా ప్రోత్సహించాలన్నారు.ఈ క్రీడా పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 69 పాఠశాలల విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. స్కేటింగ్, టేబుల్ టెన్నిస్, కరాటే పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.వేణుగోపాల్, వైస్‌ప్రిన్సిపాల్ పూజ సక్సేనా, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ. భరత్ తదితరులు పాల్గొన్నారు.

తవ్వేకొద్దీ..!

(ఐదో పేజీ తరువాయి)

తప్పిదాలు జరిగినట్లు గుర్తించి ఈ మేరకు విచారణ జరుపుతున్నారు. నిధులు దుర్వినియోగం వెనుక క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు సామాజిక తనిఖీల్లో అధికారులు గుర్తించారు. క్షేత్రసహాయకులు, ఏపీవోలు, టీఏ, ఈసీ, పంచాయతీ కార్యదర్శులపైనా ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. స్వాహా చేసిన నిధులను తిరిగి రికవరీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అక్రమాలకు బాధ్యులైన వారి నుంచి నిధుల రికవరీ కోసం నోటీసులు



జారీ చేస్తున్నారు.

అడ్డుకట్ట ఏదీ?

ఉపాధి హామీ పథకం అమల్లో అవకతవకలు అరికట్టడానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అక్రమాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఉపాధి పనుల్లో అక్రమాలను అడ్డుకునేందుకు ఇటీవల గ్రామ పంచాయతీ స్థాయిలో నిఘా పర్యవేక్షణ (విజిలెన్స్ మానిటరింగ్) కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి కమిటీలో అయిదుగురు చొప్పున సభ్యులను నియమించింది. కమిటీలో మండల ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘం సభ్యురాలు, స్వచ్ఛంద సంస్థ సభ్యుడితో పాటు ఒక ఉపాధి కూలీ సభ్యులుగా ఉన్నారు. వీరంతా ఉపాధి పనులు జరిగిన వారానికి క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేసి నివేదికను మండల పరిషత్ అధికారికి పంపుతారు. మండల అధికారులు వీటిని పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక ఇస్తారు. గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలు ఉపాధి హామీలో అక్రమాలకు కళ్లెం వేస్తుందని అంతా భావించారు. కానీ అక్రమాలు ఇంకా కొనసాగుతూనే ఉండడం గమనార్హం.

వడివడిగా అండర్‌పాస్ నిర్మాణం

అంకుశాపూర్ వద్ద రూ.30కోట్లతో పనులు

హైవే దాటేందుకు ప్రజల ఇక్కట్లు ● అండర్ పాస్‌తో ప్రమాదాలకు చెక్


వరంగల్-హైదరాబాద్ హైవేపై అండర్ పాస్ పనులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై అంకుశాపూర్ వద్ద అండర్‌పాస్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ అంకుశాపూర్ అండర్ పాస్ నిర్మాణం పనులు చేస్తోంది. ఈ రోడ్డుతో అంకుశాపూర్, మాదారం, పడమటి సోమారం, వెంకిర్యాల్ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు, హైవే దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ అండర్‌పాస్‌తో వారికి సులువుగా ఉంటుంది. రాత్రి, తెల్లవారుజాము సమయాల్లో ఈ హైవేపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. జాతీయ రహదారి, సర్వీసు రోడ్లపై గతంలో జరిగిన ప్రమాదాల్లో ఎంతోమంది చనిపోయారు. ఈ ప్రాంతంలో ఇంజినీరింగు, ఇంటర్ కళాశాలలు ఎక్కువగా ఉండటంతో ప్రయాణికుల్లో విద్యార్థులు, యువత ఎక్కువ. అంకుశాపూర్ వద్ద అండర్‌పాస్ నిర్మించాలని గతంలో గ్రామస్తులు ఆందోళన చేశారు. దీంతో ప్రభుత్వం రూ.30కోట్లతో అండర్ పాస్ నిర్మిస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రహదారి పనులతో ట్రాఫిక్‌ను సర్వీసు రోడ్డుకు మళ్లించారు. హెచ్‌పీసీఎల్ నుంచి జమిలాపేట్ రోడ్డు వరకు రోడ్డు ఎత్తు పెంచి అండర్‌పాస్ నిర్మిస్తున్నారు. రహదారిపై ఉన్న చెట్లను తొలగించి సర్వీసు రోడ్డును ఇరువైపులా విస్తరించి రాకపోకలు సాగిస్తున్నారు. పనులు చురుగ్గా చేయిస్తున్నారు.

ట్రాఫిక్‌ను మళ్లించాం



హెచ్‌పీసీఎల్ వద్ద జాతీయ రహదారిపై అండర్‌పాస్ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుంది. రహదారిపై నుంచి వెళ్లే వాహనాలను సర్వీసు రోడ్డులోకి మళ్లించాం. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సిబ్బందిని నియమించాం. పనులు జరుగుతున్న దృష్ట్యా వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలి.

- రవీందర్, ట్రాఫిక్ సీఐ, ఘట్‌కేసర్

అండర్‌పాస్ ఏర్పాటు సంతోషకరం



గతంలో జాతీయ రహదారిపై వెళ్లాలంటే భయమయ్యేది. హైవే దాటుతుండగా ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు పోయాయి. దీంతో ఈ రోడ్డును వదిలి ఎన్ఎఫ్‌సీనగర్ మీదుగా ఘట్‌కేసర్‌కు వెళ్తున్నాం. అండర్‌పాస్‌తో ప్రయాణం సులువుగా అవుతుంది. అయితే పనులు త్వరగా పూర్తిచేయాలి.

- పిట్టల రాజు, అంకుశాపూర్

నిర్మాణంలో నాణ్యత పాటించాలి



అండర్ పాస్ నిర్మాణంలో నాణ్యత పాటించాలి. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేయకుండా జాతీయ రహదారుల అథారిటీ అధికారులు పర్యవేక్షించాలి. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

- ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, ఘట్‌కేసర్

వీధి వ్యాపారులకు 'లోక కల్యాణ మేళా'

» జిల్లాలో 7,498 వీధి వ్యాపారుల గుర్తింపు



వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న మెప్మా అధికారులు

తాండూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం మెప్మా ద్వారా లోక కల్యాణం పేరిట పలు స్కీమ్‌లను అమలు చేస్తోంది. నాలుగు మున్సిపాలిటీలు తాండూరు, వికారాబాద్, కొడంగల్, పరిగిలో 7,498 మంది వీధి వ్యాపారులు గుర్తించారు. పీఎం స్వనిధి స్కీమ్ కింద ఆన్‌లైన్‌లో మెప్మా సిబ్బంది ద్వారా రూ.15వేలు, రూ.25 వేలు, రూ.50వేల వరకు మూడు విడతలుగా రుణాలు ఇస్తున్నారు. సకాలంలో రుణాలు చెల్లించిన వారికి నాలుగో విడతలో క్రెడిట్ కార్డులను అందజేస్తున్నారు. కేవలం ఒక్క రూపాయి వడ్డీతో ఈ రుణాన్ని అందించి వ్యాపార అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ సహకారంతో వీధి ఆహార విక్రేతలకు ఫుడ్‌సేఫ్టీపై, వ్యక్తిగత పరిశుభ్రతపై శిక్షణ ఇస్తున్నారు. స్వనిధి పే సమృద్ధిలో భాగంగా వీధి విక్రయదారులకు వారి కుటుంబాలకు పీఎం సురక్షణ బీమా యోజన కింద ప్రమాదవశాత్తు మృతి చెందితే బీమా చెల్లించనున్నారు. పీఎం జన్‌దన్ యోజన కింద వన్ రేషన్ కింద రేషన్ కార్డులు, జన్ సురక్ష యోజన, పీఎం శ్రమ యోగి, మన్‌దన్ యోజన వంటి కార్యక్రమాలు వైద్య, ఉద్యో, పోలీస్, మున్సిపల్ సివిల్ సప్లయి శాఖల భాగస్వామ్యంతో అమలు చేస్తున్నారు. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం మాతృ వందన యోజన పథకాలను కూడా అమలు చేస్తున్నారు. 200 సార్లు డిజిటల్ లావాదేవీలు చేసే వారికి రూ. 1,200 పారితోషికంగా లబ్ధిదారులకు అందజేస్తారు.



లోక కల్యాణ మేళా బ్రోచర్

సమాజ శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు దోహదం

» టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి


పూజలు నిర్వహిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యక్తి సన్మార్గ పురోగమనానికి, సమాజ శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు దోహదపడుతాయని టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక భావాలతో ముందుకు సాగేవారు ఆనందమయ జీవితాన్ని పొందుతారని అన్నారు. కడ్తాల మండలం కానుగుబావి తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ తుల్జాభవానీ మాత దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో సుంకిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.3లక్షల విరాళం అందించిన సుంకిరెడ్డిని ఆలయ మర్యాదలతో నిర్వాహకులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో దేవాలయ నిర్మాణం, భక్తుల వసతుల కల్పనకు ఐక్యత ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బీక్యానాయక్, పాండు నాయక్, నర్సింహ, లచ్చునాయక్, జాన్యనాయక్, నర్య, రాజు, లక్ష్మణ్, దేవులా, రతన్, సూర్యనాయక్, శంకర్‌నాయక్, పత్యనాయక్, పిరమిడ్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సులు నడపాలని వినతి


మంత్రి పొన్నంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి-హైదరాబాద్ రూట్‌లో అదనపు బస్సులు నడపాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో మంత్రి పొన్నంను టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లి రాములుతో కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కల్వకుర్తి డిపోకు మరిన్ని కొత్త బస్సులను కేటాయించాలని కోరారు. తుక్కుగూడ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు బీఎన్ రెడ్డి మీదుగా ప్రస్తుతం నడుస్తున్న బస్సులకు అదనంగా మరిన్ని బస్సులను నడపాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా కల్వకుర్తి నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని అభ్యర్థించగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కడ్తాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు కాలె మల్లయ్య, అరకోటం బాల్‌రాజ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చొరవ


మార్కెట్ కమిటీ భవన నిర్మాణానికి భూమి పూజలో తిరుపతిరెడ్డి

కొడంగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన కొడంగల్ ప్రాంత సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. కొడంగల్ పట్టణంలో శుక్రవారం డివైడర్ నిర్మాణం, మార్కెట్ కమిటీ భవన నిర్మాణం, క్రీడా మైదానం తదితర వాటికి అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక కడా కార్యాలయంలో స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొడంగల్‌లో 3 కిలో మీటర్ల మేర డివైడర్‌తో పాటు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.10కోట్ల వ్యయంతో నూతన మార్కెట్ కమిటీ భవన నిర్మాణంతో మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కొడంగల్ పట్టణ శివారులోని డిగ్రీ కళాశాల ఆవరణలో క్రీడా మైదానం ఏర్పాటుతో క్రీడలను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఇళ్లు కోల్పోతున్న 85 మందిని గుర్తించి వారికి నష్టపరిహారంతో పాటు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 85 మంది బాధితులకు రూ.21కోట్లకు పైగా పరిహారంతో పాటు అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ బల్‌రామ్, మున్సిపల్ కమిషనర్ బల్‌రామ్ నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లు రాజేశ్‌రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, వేణుగోపాల్, ముద్దప్పదేశ్‌ముఖ్, ఎస్.ప్రశాంత్, నర్సిములుగౌడ్, ఆవుటి శేఖర్, కృష్ణంరాజు, శివకుమార్‌గుప్త, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, నర్సిములునాయుడు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సీతారాం

కందుకూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మానవ జీవితాన్ని నాశనం చేస్తుందని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కందుకూరు సీఐ సీతారాం సూచించారు. శుక్రవారం మండల కేంద్రం(కొత్తగూడ)లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. డ్రగ్స్ తీసుకున్న సమయంలో మనం ఏం చేస్తున్నామో కూడా తెలియని స్థితి ఏర్పడుతుతుందన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుకు రావాలన్నారు. డ్రగ్స్‌ను అమ్మినా, వినియోగించినా చట్టపరంగా నేరమని, అలాంటి వాటికి నేటి యువత దూరంగా ఉండాలన్నారు. సదస్సులో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేర పరిశోధనకు సీసీ కెమెరాలు దోహదం


నగదును ఎస్ఐ వరప్రసాద్‌కు అందజేస్తున్న జవహర్‌లాల్ నాయక్

కడ్తాల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధన, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, గిరిజన సేవా సంఘం రాష్ట్ర నేత జవహర్‌లాల్ నాయక్ అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలంతా పోలీసులకు సహకరించాలని కోరారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామానికి చెందిన జవహర్‌లాల్ నాయక్ రూ.14 వేలు, రమేశ్ రూ.10 వేలు సమకూర్చారు. శుక్రవారం కడ్తాల పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ వరప్రసాద్‌కు నగదును అందజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రాములు, రామకోటి, కాంగ్రెస్ నాయకుడు తులసీరామ్ నాయక్, తదితరులు ఉన్నారు.

స్పెషల్ క్లాస్‌లో రచ్చ

» విద్యార్థులను మోకాళ్లపై కూర్చోబెట్టిన హెచ్‌ఎం

» సెల్‌ఫోన్‌లో వీడియో తీసిన మరో ఉపాధ్యాయుడు

» విచారణకు ఆదేశించిన డీఈవో


విద్యార్థులను మోకాళ్లపై కూర్చోబెట్టిన దృశ్యం

తాండూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న స్పెషల్ క్లాస్‌లో ఇద్దరు టీచర్ల మధ్య వైరం రచ్చకెక్కింది. పాఠశాల హెచ్‌ఎం క్లాస్‌లకు హాజరు కాని విద్యార్థులకు మోకాళ్లపై కూర్చోబెట్టింది. దీంతో అదే పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు సెల్‌ఫోన్‌లో వీడియో తీసి డీఈవోకు పంపాడు. అట్టి వీడియో వివిధ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో డీఈవో విచారణకు ఆదేశించింది. తాండూరు పట్టణంలోని ప్రభుత్వ నంబర్ 1 ఉర్దూ మాధ్యమ పాఠశాలలో ఓ జూనియర్ టీచర్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. అదే పాఠశాలలో ఓ సీనియర్ కూడా ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అయితే పాఠశాలలోని పదో తరగతి విద్యార్థుల కోసం స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. ఈ క్లాస్‌లకు కొంతమంది విద్యార్థులు హాజరుకావడం లేదని గమనించి మోకాళ్లపై కొద్దిసేపు కూర్చోబెట్టి పనిష్మెంట్ ఇచ్చారు. దీనిపై తాండూరు మండల విద్యాధికారి వెంకటయ్యగౌడ్‌ను డీఈవో విచారణ అధికారిగా నియమించింది. గురువారం జరిగిన ఘటనపై ఎంఈవో వెంకటయ్యగౌడ్ విచారణ జరిపి డీఈఓకు నివేదించారు. ఈవిషయమై తల్లిదండ్రులు కానీ విద్యార్థులు కానీ ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎంఈవో తెలిపారు.



బాల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

బాల్‌రెడ్డి సేవలు మరువలేనివి

మంచాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దివంగత పీఏసీఎస్ చైర్మన్ నల్లనాగుల బాల్‌రెడ్డి సేవలు మరువలేనివని టీడీపీ నాయకులు అన్నారు. ఆయన 68వ జయంతిని మంచాల మండల పరిధిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ చక్రపాణి ఆధ్వర్యంలో నోములలోని బాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ అన్నదాతల అభ్యున్నతికి బాల్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఆయన అన్నారు. మంగళారం యాదయ్య, దండ బాల్‌రాజ్, బండారు మహేష్, కసరమోని బాలయ్య, దూసరి చెన్నయ్య, అయితరాజు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రి శివారులోని రాఘవేంద్ర కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పత్తికి ప్రభుత్వం కింటాలుకు రూ.8,110 మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే వరికి రూ.2,389లతో పాటు రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మొక్కజొన్నకు రూ.2,400 మద్దతు ధర ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యం విషయంలో నాణ్యతను పాటించాలని తెలిపారు. దళారుల మాటలు నమ్మి ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించవద్దని సూచించారు. సీఎం రైతుల కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నారని వివరించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మాజీ జడ్పీటీసీ విశాల, కరుణాకర్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి శంకరయ్య, ప్రాంతీయ ఉపసంచాలకుడు పి.ప్రసాద్‌రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్, మార్కెట్ శాఖ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, పత్తి కొనుగోలు అధికారి కె.తిరుమల్‌రావు, పత్తి మిల్లు యజమాని యంసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ రూరల్ : పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని తొందరపడి ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవద్దని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మండల పరిధిలోని కొత్తపేటలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పంటలను సాగు చేస్తారని, పంటలు చేతికి వచ్చిన తరువాత తొందరపడి ప్రైవేటు వ్యాపారులకు అమ్మి నష్టపోతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు చేతికి రాకముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకవచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. సన్నాలకు బోనస్ ఇస్తున్నామని ప్రైవేటుకు విక్రయిస్తే బోనస్ పొందలేరని వివరించారు. కల్లాల నుంచి నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావద్దని సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకవస్తే మద్దతు ధర పొందవచ్చన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా ఉంటుందని, ఎరువుల కొరత ఏర్పడినప్పుడు సమన్వయంతో సమస్యను పరిష్కరించామని తెలిపారు. రైతులకు మేలు చేసే పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ గంగ్ర జగదీశ్వర్ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, ప్యాక్స్ డైరెక్టర్ పల్లాటి కృష్ణయ్య, మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, జగదీశ్వరప్ప, యెన్నం శ్రీధర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, పర్వతాలు, రాములు, పురుషోత్తం రెడ్డి, మహిళా అధ్యక్షురాలు గుండె రాణి, అనసూయమ్మ, రమేష్, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తుల్జాభవానీ మాత విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



విగ్రహ ప్రతిష్ఠ వేడుకలో మహిళలు



పూజలో దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కానుగుబావి తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ తుల్జా భవానీ మాత దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు, తండా నేతలు విశాల వసతులు ఏర్పాటు చేశారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి తండా గిరిజనులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమానికి టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, సీజీఆర్ చైర్మన్ లీలాలక్ష్మారెడ్డి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్చకులు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు వేదపారాయణం, మండపారాధన, హోమాలు, పూజలు చేపట్టారు. అనంతరం ఆలయంలో తుల్జాభవాని మాతను భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. అతిథులు, ఆలయ నిర్మాణ దాతలను ఆలయ నిర్వాహకులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మహాపూర్ణాహుతితో పాటు మూడు రోజుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ముగించారు. పూజా కార్యక్రమంలో తండా నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బీక్యానాయక్, లచ్చిరామ్ నాయక్, సేవ్యానాయక్, శంకర్ నాయక్, హరిచంద్, రాములు నాయక్, బావోజీ బోజ్యామహారాజ్, నిర్వాహకులు బీక్యానాయక్, పాండు, బీచ్యానాయక్, నర్సింగ్, బీచ్య, లక్ష్మణ్, నరేశ్, జాన్య, రాజు, దేవుల, రతన్, తదితరులు పాల్గొన్నారు.

బంజారాల ఆరాధ్య దైవం తుల్జాభవానీ

ఆమనగల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం తుల్జాభవానీ మాత అని కడ్తాల మాజీ జడ్పీటీసీ, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. శుక్రవారం కడ్తాల మండలంలో ఆయన పర్యటించారు. కానుగుబావి తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ తుల్జాభవానీ మాత ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు దశరథ్‌ను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మాజీ సర్పంచ్‌లు బీక్యానాయక్, హరిచంద్ నాయక్, రాములు, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సదర్ ఉత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు సముచిత స్థానం

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం టౌన్ చౌరస్తా వద్ద గురువారం రాత్రి యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైనారు. వృత్తిదారుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. అసంపూర్తిగా ఉన్న యాదవ సంఘం భవనానికి రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. యాదవ సంఘం నాయకుల కోరిక మేరకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు సీట్లు కేటాయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భూపతిగల్ల మహిపాల్, ఇబ్రహీంపట్నం యాదవ సంఘం నాయకులు చింతం బాల్‌రాజ్ యాదవ్, బర్ల జగదీశ్ యాదవ్, ముంత శంకర్, కసరమోని మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో పెయింటర్ మృతి

చేవెళ్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో పెయింటర్ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కమ్మెట గేట్ వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీస్‌లు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని కమ్మెట గ్రామానికి చెందిన దొబ్బలి శ్రీనివాస్(36) పెయింటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజుమాదిరిగానే శుక్రవారం ఉదయం పని నిమిత్తం ఇంటి నుంచి బైక్‌పై ఎన్కెపల్లి గేట్ వద్దకు బయలుదేరాడు. ఈక్రమంలో శంకర్‌పల్లి నుంచి మరో బైక్ చేవెళ్ల వైపు వస్తోంది. రెండు బైక్‌లు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. శ్రీనివాస్ తలకు తీవ్రరక్తగాయాలు కాగా అక్కడికక్కడే మృతిచెందాడు. మరో బైక్ వ్యక్తి స్వల్పగాయలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య విజయ, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కాగా, కమ్మెట గ్రామం గేట్ వద్ద ఎలాంటి బోల్‌గార్డులు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్‌లు అధికారులు బోల్‌గార్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నీటి సంపులో పడి మహిళ..

కొత్తూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామానికి చెందిన లలిత(45) నీటి సంపులో పడి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఇన్‌స్పెక్టర్ నర్సయ్య కథనం ప్రకారం.. ఇంటి సమీపంలో గురువారం లలిత నీటి సంపులో ప్రమాదవశాత్తు పడి మృతిచెందింది. కుటుంబ సభ్యులు గాలించగా శుక్రవారం సంపులో శవమై కనిపించింది. శవాన్ని షాద్‌నగర్ కమ్యూనిటి ఆసుపత్రికి తరలించారు. ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ నర్సయ్య తెలిపారు.

బోరు మోటార్ తీసుకెళ్లిన వ్యక్తిపై కేసు

తలకొండపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హర్యానాయక్ తండాలో గ్రామ పంచాయతీకి చెందిన బోరు మోటర్ అనుమతి లేకుండా తీసుకెళ్లిన కొర్ర కృష్ణపై కేసు నమోదు చే సినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. బోరు మోటర్ ను అనుమతి లేకుండా తీసుకుపోయి ప్రభుత్వ ఆస్తులకు భంగం కలిగించి సామాజిక మాధ్యమంలో తప్పుడు ప్రచారం చేసిన కొర్ర కృష్ణపై స్థానిక పంచాయతీ కార్యదర్శి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. హర్యానాయక్ తండాలో శుక్రవారం ఎంపీడీవో శ్రీకాంత్ పర్యటించారు. మిషన్ భగీరథ, బోరు మోటర్లు, తాగునీటి పథకాలను పరిశీలించారు. తాగునీటి సరఫరాపై స్థానికులతో ఆరా తీశారు.

కానిస్టేబుల్‌ను తోసేసి పరారీ

● నంబర్‌ప్లేట్ సరిగాలేని కారును పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా ఘటన

● డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు

యాచారం, అ క్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నంబర్‌ప్లేట్ సరిగ్గా లేని కారును పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా కానిస్టేబుల్‌ను కారు నుంచి బయటకు తోసేసి పారిపోయిన కారు డ్రైవర్ ఉదంతం శుక్రవారం సాయంత్రం యాచారంలో చోటుచేసుకుంది. ఎస్సై మధు కథనం ప్రకారం.. నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. నంబర్ ప్లేట్ సరిగ్గాలేని ఓ కారును కానిస్టేబుల్ శ్రీశైలం, హోంగార్డు పోచయ్యలు ఆపారు. వివరాలు ఆరా తీయడానికి స్టేషన్‌కు తీసుకెళ్లాలని ఎస్సై సూచనతో కారులో కానిస్టేబుల్ శ్రీశైలం ఎక్కారు. కొంత దూరం కారు వెళ్లిన తరువాత అందులో ఉన్న నలుగురు వ్యక్తులు కానిస్టేబుల్ శ్రీశైలంను బయటకు తోసేసి కారును తీసుకెళ్లారు. కాగా, కారులో ఓ వ్యక్తి కొర్ర రాజుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



కేతావత్ థార్యా(ఫైల్)

కేశంపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిన భర్త అదృశ్యమైన సంఘటన కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ తూర్పుగడ్డ తండాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేశంపేట సీఐ నరహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన కేతావత్ థార్యా(50) తన భార్య ముత్యాలితో ఈనెల 21న గొడవపడి ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు తమ బంధువుల వద్ద వెతికినా ఆచూకీ తెలియరాలేదు. థార్యా 5 అడుగుల 3 అంగుళాల ఎత్తు, గోధుమ వర్ణంలో ఉంటాడని తెలిపారు. ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో బ్లాక్ కలర్ ప్యాంట్, వైట్ కలర్ షర్టు ధరించి ఉన్నాడని వివరించారు. అదృశ్యానికి గురైన వ్యక్తి కుమారుడు తూకారం శుక్రవారం ఫిర్యాదు చేశాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. విచారణ బాధ్యత హెడ్ కానిస్టేబుల్ రాములుకు అప్పగించినట్లు తెలిపారు. అదృశ్యానికి గురైన వ్యక్తి సమాచారం తెలిస్తే కేశంపేట పీఎస్ నెంబర్లు 8712567699, 8712663331లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

ఆదిభట్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేయగా ఒకరు పరారీలో ఉన్నారు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ కథనం ప్రకారం.. ఆదిభట్లకు ఆరుగురు వ్యక్తులు సాంబయ్య వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడతున్నట్లు ఆదిభట్ల పోలీసులకు విశ్వసనీయ సమాచారం రావడంతో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.25 వేలు, 2 సెట్ల ప్లేయింగ్ కార్డ్స్, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

తెలంగాణ జాగృతి షాద్‌నగర్ బాధ్యుడిగా రమేశ్



కేశంపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి షాద్‌నగర్ నియోజకవర్గ బాధ్యుడిగా కేశంపేట మండలం కాకునూర్ గ్రామానికి చెందిన సీమల రమేశ్‌ను నియమించారు. ఈమేరకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో షాద్‌నగర్ నియోజకవర్గం బాధ్యతలు అప్పగించినందుకు సీమల రమేశ్, జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కవితకు కృతజ్ఞతలు తెలిపారు. జాగృతి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని రమేశ్ తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారి తరఫున పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. జాగృతిని ప్రజలందరు ఆదరించాలని కోరారు.

ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్‌దే విజయం

(ఐదో పేజీ తరువాయి)

కేంద్రం వివక్ష చూపుతుందని నారాయణరెడ్డి ఆరోపించారు. ఓటు చోరి ద్వారా కేంద్రంలో ఆ బీజేపీ అధికారంలో కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ్మ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మ నాయక్, ఎగిరిశెట్టి సత్యం, సురేందర్ రెడ్డి, శేఖర్‌గౌడ్, వెంకటేశ్వర్ రావు, జగన్, నర్సింహ, రామకృష్ణ, విష్ణు ఉన్నారు.



తలాటి స్వామిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కాంగ్రెస్ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ నాయకుడిని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. కడ్తాల మండలం ముద్విన్ గ్రామానికి చెందిన తలాటి స్వామి ముగ్గురు చిన్నారులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా యాచారం మండలం తమ్మలోనిగూడెం వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో అభిరామ్, హర్షిక్‌రామ్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడు స్వామి, ఆయన కుమారుడు సాత్విక్‌లు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిద్దరిని శుక్రవారం ఎమ్మెల్యే పరామర్శించారు. వైద్యుల ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా ఆమనగల్లు పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సూర్యప్రకాశ్ ను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

యువత జాగృతితో కలిసి రావాలి



పాండురంగారెడ్డి సమక్షంలో జాగృతిలో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

కందుకూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సామాజిక తెలంగాణ కోసం, సమన్యాయం కోసం నేటి యువత తెలంగాణ జాగృతితో కలిసి రావాలని ఆ సంస్థ రాష్ట్ర నాయకులు కోల శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డిలు పిలుపునిచ్చారు. శుక్రవారం కందుకూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు ఆ పార్టీని వీడి జాగృతి మహేశ్వరం ఇన్‌చార్జి అందుగుల సత్యనారాయణ ఆధ్వర్యంలో నగరంలోని ఆ సంస్థ కేంద్ర కార్యాలయానికి సుమారు 50మంది తరలివెళ్లి తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి తెలంగాణ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత నేతృత్వంలో ఉద్యమాలు చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు లావణ్య, భవాని, సుజాత, స్వాతి, జగన్, ఉండెల బాబురావు, తదితరులు పాల్గొన్నారు. కాగా, తెలంగాణ జాగృతి ఎస్సీసెల్ కందుకూరు మండల అధ్యక్షుడిగా కందుకూరు గ్రామానికి చెందిన రాయకంటి జగన్‌ను నియమిస్తున్నట్లు ఆ సంస్థ మహేశ్వరం ఇన్‌చార్జి అందుగుల సత్యనారాయణ ప్రకటించారు.

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి



లేమూరులో జామతోటను పరిశీలిస్తున్న వెంకట్‌రాంరెడ్డి

కందుకూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని పండ్లతోటలు, కూరగాయల పంటల సాగు చేపట్టి అధిక దిగుబడులను పొందాలని మండల సహకార సంఘం చైర్మన్ ఎస్.వెంకట్‌రాంరెడ్డి కోరారు. శుక్రవారం రైతు కమిషన్ అధికారి మహేష్‌నాయక్, మండల వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో కలిసి మండలంలోని అగర్‌మియాగూడ, లేమూరు గ్రామాల్లోని పండ్లతోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. పండ్లతోటల పెంపకానికి డ్రిప్పులు, స్ప్రింక్లర్లను రాయితీపై మంజూరు చేయడంతో పాటు మొక్కల పెంపకానికి సైతం రాయితీలు అందిస్తున్నట్లు గుర్తు చేశారు. ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు యంత్రాలపై సబ్సిడీ ఇస్తున్నారని, రైతులకు కూలీల కొరత లేకుండా యంత్రాలను అందజేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఎప్పటికప్పుడు రైతులకు అందాల్సిన పథకాలపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారి లావణ్య, ముచ్చర్ల మాజీ సర్పంచ్ ఇ.రాంచంద్రారెడ్డి, నాయకులు రాణాప్రతాప్‌రెడ్డి, డిల్లీ శ్రీధర్, ఆటీబ్, మూల ఇంద్రారెడ్డి, శ్రీనివాస్, రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం

తలకొండపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం దశల వారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కొత్తగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో చుక్కాపూర్ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు దాసరి యాదయ్య, జక్కు శ్రీనివాస్ రెడ్డి, కాడిగ చంద్రకుమార్, రాజలింగం, ర ఘు, నజీరుద్దీన్, కడారి పర్వతాలు, జంగయ్య, లాయ్య, జహంగర్, తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో హన్మకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాన్ని కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. నాయకులు విజయ్, పత్య, సురేశ్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుంటాం

బీజేపీ యువనాయకుడు బోయ శంకర్

కొందుర్గు అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుంటామని బీజేపీ యువనాయకుడు బోయ శంకర్ అన్నారు. శుక్రవారం కొందుర్గు మండల పరిధిలోని చెరుకుపల్లి గ్రామంలో యువ నాయకుడు బోయ శంకర్ తన సొంత ఖర్చులతో బోరు వేయించి మోటర్ బిగించారు. నాయకుడు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ. బీజేపీతోనే గ్రామాలు అభివృద్ధి చెదుతున్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నా రు. గ్రామంలోని ప్రజల నీటి అవసరాలు తీరనున్నాయని తెలిపారు. తాగునీటి సమస్య తీర్చినందుకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శ్రీశైలం, చెన్నయ్య, యాదయ్య, వీరయ్య, శేఖర్, యాదగిరి, గ్రామస్తులు ఉన్నారు.

రిజర్వేషన్ల కోసం సంఘటితం కావాలి



సమావేశంలో వివిధ పార్టీల నేతలు

మంచాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు సాధించేదాకా సంఘటితంగా ఉంటూ ఉద్యమం ఉధృతం చేయాలని ఆరుట్లలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ సంఘాలు, పార్టీల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడి బస్టాండు చౌరస్తాలో నిర్వహించిన సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఇందుకోసం రాజకీయాలకతీతంగా కలిసికట్టుగా శాంతియుత ఉద్యమకార్యాచరణ రూపొందించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కంబాలపల్లి భాస్కర్, చీరాలరమేష్, కావలిబుగ్గ రాములు, మంకు మురళి, మాడ్గుల కృష్ణ, గుడ్డిమల్ల చంద్రయ్య, మహ్మద్ సలాం, చిందం జంగయ్య, యూసుఫ్‌అలీ, అంతటిరాజు, ఉదరి నర్సింహ, ఆనంగల్ల పరమేష్, పంబాల బుగ్గరాములు, జంగయ్యగౌడ్, శ్రీశైలం, మారయ్య, వెంకటేష్, యాదయ్య, గుడ్డిమల్ల రాజు, రావుల చంద్రయ్య ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులు

మాల్ మార్కెట్లో పత్తిని విక్రయించేందుకు అనుమతివ్వండి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మాల్ మార్కెట్లో ఉన్న సీసీఐ కొనుగోలు కేంద్రంలో తాము సాగు చేసిన పత్తిని విక్రయించేందుకు అనుమతి ఇవ్వాలని యాచారం మండలానికి పలువురు రైతులు శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రమందజేశారు. మాల్‌లో ఉన్న సీసీఐ కొనుగోలు కేంద్రం నల్లగొండ జిల్లా పరిధిలోకి వస్తుందని, జిల్లా వేరైనప్పటికీ యాచారం మండల రైతులకు 5-10 కిలోమీటర్ల దూరంలోనే కొనుగోలు కేంద్రం ఉంటుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతులు 50-75 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆమనగల్లు మార్కెట్‌లో పత్తి విక్రయించాలని అధికారులు చెప్తున్నారని.. ఇది దూరభారమవుతున్నందున దగ్గర్లో ఉన్న మాల్ మార్కెట్లోనే పత్తి విక్రయించేందుకు అనుమతినీయాలని ఈ సందర్భంగా రైతులు కోరారు.

బస్సు ప్రమాద ఘటనపై వంశీచంద్‌రెడ్డి దిగ్భ్రాంతి

ఆమనగల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూల్ బస్సు ప్రమాద సంఘటనపై సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే రాష్ట్రానికి చెందిన మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా వంశీచంద్ రెడ్డి పేర్కొన్నారు.